క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్

సంతనూతలపాడు: అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న ఎఫ్ఎల్ఎన్ ప్రత్యేక శిక్షణతో కేంద్రాలు బలోపేతం కావాలని ఒంగోలు డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్లో మండల స్థాయి అంగన్‌వాడీ టీచర్లకు జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో భాగంగా నాలుగో రోజు శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి సంతనూతలపాడు ఎంఈఓ డి.వెంకారెడ్డి అధ్యక్షత వహించారు. శిక్షణకు కోర్స్ డైరెక్టర్‌గా సంతనూతలపాడు హైస్కూల్ హెచ్ఎం ఎం.ప్రమోద వ్యవహరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, పార్వతి, రిసోర్స్ పర్సన్స్ మౌలాఖాన్, శేషుకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మిగులు ఎయిడెడ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ఒంగోలు సిటీ: మిగులు ఉపాధ్యాయులకు సీనియార్టీ లిస్టు ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లోకి శాశ్వతంగా సర్దుబాటు చేసి న్యాయం చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కోర్టుకెళ్లిన 13 యాజమాన్య పాఠశాలలకు, జిల్లాలో విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను, 40 మందిలోపు విద్యార్థులున్న ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయా యాజమాన్యాల ఎయిడెడ్ పాఠశాలలకు పంపుతున్నారన్నారు. కానీ, ఆ యాజమాన్యాలు ఉపాధ్యాయులను విధుల్లో చేర్చుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి మిగులు ఎయిడెడ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెస్ట్



కిడ్స్ సైన్స్ ఫెస్ట్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఒంగోలు సిటీ: నగరంలోని మంగమూరుడొంకలో గల నారాయణ కిడ్స్ ప్లే స్కూల్లో శనివారం కిడ్స్ సైన్స్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సోలార్ ప్రాజెక్టు సిస్టం, మ్యాథ్స్ మ్యాజిక్, మ్యాజిక్ వర్డ్స్, హ్యాండ్ ప్రింట్, సేవ్ ఎర్త్, యానిమల్ సౌండ్స్ తదితర ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఎంతో చక్కగా వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కొల్లా సౌజన్య, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, రమ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమస్యపై పోరాడిన తవనం

ఒంగోలు టౌన్: సామాజిక సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన కమ్యూనిస్టు యోధుడు తవనం చెంచయ్య అని, నేటి తరానికి ఆయన ఆదర్శంగా నిలిచారని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక ఎల్బీజీ భవన్ తవనం చెంచయ్య 11వ వర్ధంతి సందర్భంగా కేంద్ర బడ్జెట్–గ్రామీణ పేదలపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, నెరుసుల వెంకటేశ్వర్లు, కేజీ మస్తాన్, ఊసా వెంకటేశ్వర్లు, బాల నాగయ్య, వీర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో రిలీఫ్ అందించాలి

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో కోర్టు తీర్పులతో శిక్ష పడిన కేసులకు సంబంధించిన బాధితులకు సత్వరమే రిలీఫ్‌తో పాటు ఉద్యోగం ఇవ్వాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం డీఆర్వో ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు.

ఆజాద్ వర్ధంతిని ప్రభుత్వం నిర్వహించాలి

ఒంగోలు వన్‌టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ త్యాగాలను ప్రభుత్వం మరిచిందని, ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వపరంగా ఘనంగా నిర్వహించాలని ముస్లిం సంఘాలు డిమాండ్ చేశాయి. ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఒంగోలు నగరంలోని పాత కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి ముస్లిం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. ముస్లిం ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్యాలయం ఖాళీ..!



ఒంగోలు నగరంలోని ప్రగతి భవనంలో ఉన్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, కార్పొరేషన్ కార్యాలయం శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇలా ఖాళీగా కనిపించింది. ఆ శాఖ ఉన్నతాధికారితో పాటు ఉద్యోగుల్లో ఒక్కరు కూడా వారి సీట్లలో కనిపించలేదు. తలుపులు తెరిచి ఉంచగా, కుర్చీలన్నీ ఖాళీగా ఉన్నాయి. ఈ కార్యాలయంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారితో పాటు కార్యాలయ పర్యవేక్షకుడు, సీనియర్ సహాయకుడు, జూనియర్ సహాయకుడు పనిచేస్తున్నారు. కానీ, వారెవరూ వారి సీట్లలో లేరు. కేవలం ఇద్దరు అటెండర్లు మాత్రమే కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు సంబంధించిన అభ్యున్నతి, ఆ విద్యార్థుల భవిష్యత్తు, జీవనోపాధులు, రుణాల ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం తదితర లక్ష్యాలతో గిరిజన సంక్షేమశాఖ, కార్పొరేషన్ పనిచేయాల్సి ఉంది. కానీ, ఆ లక్ష్యాలన్నింటినీ నీరుగారుస్తూ కనీసం కార్యాలయంలో ఒక్కరు కూడా అందుబాటులో లేని దుస్థితి నెలకొంది. పనులపై వచ్చిన ప్రజలకు అధికారులు, ఉద్యోగులు సెలవులో ఉన్నారంటూ.. కలెక్టరేట్‌లో ఉన్నారంటూ రకరకాల జవాబులు చెప్పి అటెండర్లు పంపించి వేస్తున్నారు.

– ఒంగోలు వన్‌టౌన్

బాధితులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది

- పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు



ఒంగోలు 9వ డివిజన్‌లో బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: బాధితులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు భరోసా ఇచ్చారు. ఒంగోలు నగరంలోని 9వ డివిజన్ ఎఫ్‌సీఐ గొడన్ ఎదురుగా ఉన్న రోడ్డులో ఒంగోలు కార్పొరేషన్ వారు ఆక్రమణలు తొలగించారనే విషయం తెలుసుకుని శనివారం రవిబాబు ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని, వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గృహాల తొలగింపులు జరగకుండా చూడాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

చుండూరును మర్యాదపూర్వకంగా కలిసిన మన్నే శ్రీనివాసరావు...

ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును ఒంగోలు మండల అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన మన్నే శ్రీనివాసరావు శనివారం మర్యాదపూర్వంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు చుండూరు రవిబాబును శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పేరకం సుబ్బారావు, కోటి వెంకటరావు, కరవది సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, దార్ల బాబూరావు, నలమలపు లక్ష్మారెడ్డి, వాకా ప్రసన్నకుమార్‌రెడ్డి, కమ్మ సురేష్, తదితరులు పాల్గొన్నారు.



చుండూరు రవిబాబును సన్మానిస్తున్న పార్టీ ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు

కాట్రగడ్డకు పరామర్శ

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ వికలాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాట్రగడ్డ శ్రీనివాసరావు చేయికి ఇటీవల ప్రమాదంలో గాయమైంది. చేతి గాయంతో బాధపడుతున్న కాట్రగడ్డ శ్రీనివాసరావును ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు శనివారం అమ్మనబ్రోలులో పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శలో పార్టీ నాయకులు సూర్యనారాయణ, స్థానిక నాయకులు ఉన్నారు.



కాట్రగడ్డ శ్రీనివాసులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న చుండూరు రవిబాబు

రికార్డుల ట్యాంపరింగ్‌పై విచారణ జరిపించండి

- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియాకు చిరంజీవి ఫిర్యాదు
- విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించిన సిసోడియా



సిసోడియాకు ఫిర్యాదు చేస్తున్న బీసీ సంఘ నాయకుడు చిరంజీవి

ఒంగోలు సిటీ: ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో డీకే రిజిస్టర్లను ట్యాంపర్ చేశారనే ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆదేశించారు. శనివారం ఒంగోలు వచ్చిన రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాంప్రకాష్ సిసోడియాను బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు బంకా చిరంజీవి కలెక్టరేట్‌లో కలిశారు. ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో డీకే రిజిస్టర్ ట్యాంపర్ అయినట్టు అప్పటి తహసీల్దార్ కొండారెడ్డి చిరంజీవి ఇచ్చిన ఎండార్స్‌మెంట్లను సిసోడియాకు అందజేశారు. తన కస్టడీలో ఉండాల్సిన రికార్డు ట్యాంపర్ అయినట్టుగా ఎండార్స్‌మెంట్ ఇచ్చిన తహసీల్దార్ కొండారెడ్డి చిరంజీవి.. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం అనేక అనుమానాలకు అవకాశం కల్పిస్తోందన్నారు. ఆఫీసులో రికార్డులను దారినపోయే వ్యక్తులు ట్యాంపర్ చేసే అవకాశం లేదన్నారు. ఇంటి దొంగలే రికార్డు ట్యాంపర్ చేయడంతో తహసీల్దార్ కొండారెడ్డి చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేయలేదని సిసోడియాకు బంకా చిరంజీవి ఫిర్యాదు చేశారు. అలాగే కొందరు రెవెన్యూ ఉద్యోగులు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని, అసైన్మెంట్ భూములకు తమ కుటుంబ సభ్యుల పేర్లతో, తమ బంధువుల పేర్లతో పట్టాలు తీసుకుంటున్నారని సిసోడియా దృష్టికి చిరంజీవి తీసుకొచ్చారు. సంతనూతలపాడు, ఒంగోలు మండలాలల్లో ఖరీదైన ప్రభుత్వ భూముల్లో మంజూరైన ఇళ్ల పట్టాల జాబితాలో రెవెన్యూ ఉద్యోగుల కుటుంబ సభ్యుల పేర్లు ఉన్నాయంటూ ఆ వివరాలను సిసోడియాకు చిరంజీవి అందించారు. తప్పుడు పద్ధతుల్లో డీకే పట్టాలు పొందడమే కాకుండా, ఆ పట్టాలకు పొజిషన్ చూపించాలని రెవెన్యూ ఉన్నతాధికారులపై కోర్టులో వేసిన కేసుల గురించి వివరించారు. ప్రస్తుత కలెక్టర్ తమీమ్ అన్సారియా వద్ద దఫేదారుగా పనిచేస్తున్న పోలా శ్రీనివాసులు నిజానికి జూనియర్ అసిస్టెంట్ అని, కలెక్టర్ దఫేదారుగా రెవెన్యూ అధికారులను ప్రభావితం చేస్తున్న పోలా శ్రీనివాసులు రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, డీకే పట్టాల కుంభకోణం ఘటనకు కేంద్ర బిందువుగా ఉన్నారంటూ సిసోడియాకు ఇచ్చిన ఫిర్యాదులో చిరంజీవి ఆరోపించారు. రెవెన్యూ ఆఫీసుల్లో ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగ యువతను కూడా మోసగిస్తున్నారని, ఈ క్రమంలో ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు కూడా నమోదైందంటూ సంబంధిత ఎఫ్ఐఆర్ కాపీని సిసోడియాకు చిరంజీవి అందజేశారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీగా తాను అనేక జిల్లాల్లో పర్యటించానని, తనకు ఇలాంటి అనైతికమైన నేరానికి సంబంధించిన ఫిర్యాదు అందలేదని, తక్షణమే విచారణ జరిపించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను సిసోడియా ఆదేశించారు.

విద్యార్థులకు కృషి, పట్టుదల ముఖ్యం

- డీఈవో కిరణ్‌కుమార్, డైట్ ప్రిన్సిపాల్ సుబ్బారావు
- ప్రధాని నరేంద్రమోదీతో నేరుగా మాట్లాడిన సాయి సహస్రకు సన్మానం

ఒంగోలు సిటీ: విద్యార్థులకు కృషి, పట్టుదల ముఖ్యమని, చదువు విషయంలో అంకితభావం కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి అత్తోట కిరణ్‌కుమార్, డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫేర్‌వెల్ ఫంక్షన్‌కు వారు అతిథులుగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఒంగోలు పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలకు మంచి పేరు ఉందన్నారు. అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయ బృందం ఈ పాఠశాలకు గొప్ప వరమని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇక్కడ విద్యాబోధన జరగడం అభినందనీయమన్నారు. పరీక్ష పే చర్చా కార్యక్రమంలో పీవీఆర్ పాఠశాల విద్యార్థిని సాయి సహస్ర ప్రధాని నరేంద్ర మోదీతో నేరుగా మాట్లాడటం జిల్లాకే గర్వకారణమని అన్నారు. సాయి సహస్రను మిగతా విద్యార్థులు కూడా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం సాయి సహస్రను ఘనంగా సన్మానించారు. సీహెచ్ రంగనాథం, ఎల్.రాజగోపాల్, బి.శ్రీరామ్మూర్తి, డీవీ సుబ్బారావు, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్, మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మార్షెల్ల సుబ్బారావు, సినీనటుడు దన్నారపు మస్తాన్‌రావు, నత్తల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు 110 మందికి పరీక్ష మెటీరియల్ అందజేశారు. ఉత్తమ విద్యార్థులైన బి.అక్షయ, పి.భానుప్రియ, ఎం.తేజస్విని, కె.బాలచందన, అక్షయ తదితరులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. డాకా హనుమారెడ్డి, కార్పొరేటర్ సుజాత దంపతులు ఉత్తమ విద్యార్థినులకు రూ.25 వేల నగదు బహుమతి అందజేశారు. అలాగే జూటూరు వెంకటసుబ్బయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి సతీమణి సీతాలక్ష్మి గణితంలో అత్యధిక మార్కులు సాధించిన అమృత వర్షిణికి మూడు వేల రూపాయల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమానికి పీవీఆర్ పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మీప్రసన్న అధ్యక్షత వహించగా, విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

లోక కళ్యాణార్థం మహా శాంతి హోమం



మహాశాంతి హోమక్రతువులో వైఖానస ఆగమ పండితులు

ఒంగోలు మెట్రో: నగరంలోని దసరాజుపల్లి లక్ష్మీపురం ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పద్మావతి, గోదా సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ముందు లోక కళ్యాణార్థం విశ్వశాంతి కోసం శనివారం శాంతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దేవస్థాన ఆవరణలో హోమగుండాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులు హోమగుండం వద్ద ఆశీనులై నవగ్రహ హోమం, శ్రీలక్ష్మీ గణపతి హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. లోక కళ్యాణార్థం మహాశాంతి హోమాన్ని వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి సభ్యులు, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని యజ్ఞ ఫలాన్ని స్వీకరించారు.



హోమక్రతువును తిలకిస్తున్న భక్తులు

షేడ్ నెట్స్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నారాయణ

ఒంగోలు వన్‌టౌన్: పురుగు మందులు లేని పంటల ఉత్పత్తిని షేడ్ నెట్స్ వ్యవసాయం ద్వారా సాధించవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ అన్నారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని టీటీడీ సెంటర్‌లో షేడ్‌నెట్స్ వ్యవసాయానికి ఎంపికైన 200 మంది రైతులకు శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సెర్ప్, రాష్ట్ర ఉద్యానవనశాఖ, ఖేతి రక్షక్ సంస్థలు షేడ్ నెట్ వ్యవసాయంపై ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. జిల్లాకు 150 యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలోని 38 మండలాల పరిధిలో కూరగాయలు, పూల మొక్కలు, నర్సరీలు పెంచే రైతులను వెలుగు–డీఆర్‌డీఏ ద్వారా 200 మందిని గుర్తించినట్లు తెలిపారు. ఖేతి ఫౌండేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీతో ఈ షేడ్ నెట్లను లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన 50 శాతాన్ని లబ్ధిదారులకు రుణ సౌకర్యంగా బ్యాంక్ లింకేజీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకంలో యూనిట్లు పొందడానికి లబ్ధిదారులు పొలానికి సంబంధించిన 1బీ, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ పుస్తకం, నీటి సదుపాయం, భూసార పరీక్ష కేంద్రం నుంచి ధ్రువీకరణ పత్రం, ఉద్యానవన శాఖచే ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి తేజ, ఏపీసీఎస్ఎఫ్ డీపీఎం సుభాషిణి పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

- డీపీఓ వెంకటనాయుడు



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ వెంకటనాయుడు

చీమకుర్తి రూరల్: పర్యావరణ పరిరక్షణలో సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించాలని, పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకట నాయుడు అన్నారు. ప్రతి మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమలో భాగంగా ఈ శనివారం మండలంలోని ఆర్ఎల్‌పురంలో తడి చెత్త పొడి చెత్తపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని కూనంనేనివారిపాలెం, పడమటి నాయుడుపాలెం గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను కూడా పరిశీలించారు. డీపీఓ పడమటి నాయుడుపాలెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవేంద్ర, ఈఓఆర్డీ అజిత, పంచాయితీ కార్యదర్శులు నరేంద్ర, శంకర్, సంతోష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న జనసేన నాయకులు

మద్దిపాడు: మండలంలోని కొలచనకోట నుంచి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ అజయ్, ఎంపీడీవో వరప్రసాద్, ఎస్సై శివరామయ్య, విద్యుత్ శాఖ ఏఈ చెన్నారెడ్డిలకు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఎస్టీ కాలనీ వాసులకు ఇచ్చిన భూములపై కన్నేసి ఆ భూముల నుంచి ఇసుక తరలిస్తున్నారని, వీరు ఇసుక తరలించే క్రమంలో అక్కడ ఉన్న 130 కేవీ, 33 కేవీ విద్యుత్ లైన్లు ఉన్నాయని, అవేమీ పట్టించుకోకుండా ఇసుక అక్రమ రవాణాదారులు ఆ లైన్ల సమీపంలో ఐదు అడుగుల దూరం వరకు తవ్వేశారని ఆరోపించారు. గుండ్లాపల్లి పారిశ్రామిక వాడకు విద్యుత్ సరఫరా చేసే 130 కేవీ విద్యుత్ లైన్ సమీపంలో ఇసుక తీస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోకుంటే స్తంభాలు కూలిపోయే అవకాశం ఉందని, అధికారులు అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ ఉపాధ్యక్షుడు ఆరే వెంకటేశ్వర్లు, నాయకులు నూనె శ్రీనివాసరావు, కాకర్లపూడి హరిత, గుండాబత్తుల సోమశేఖర్, సత్యం, కనపర్తి శేషయ్య, రామారావు, అయ్యప్ప, ఏడుకొండలు, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం పరిశీలన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎంఓ రమేష్

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల నుంచి జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఏఎంఓ రమేష్ పరిశీలించారు. 67 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొనగా, శిక్షణలో ఏం నేర్చుకున్నారనే దానిపై వివిధ రకాల ప్రశ్నలడిగి తెలుసుకున్నారు. శిక్షణ ఎంత వరకు ఉపయోగపడుతుందంటూ ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు పీపీ–1, పీపీ–2గా కొనసాగుతాయన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లు చేసిన యాక్టివిటీస్ చూసి అభినందించారు. జిల్లాలో ఏ కార్యక్రమం జరపాల్సి వచ్చినా కొత్తపట్నంలో చాలా చక్కగా అమలవుతాయని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో చెప్పినవన్నీ నోట్ పుస్తకంలో రాసుకుని వాటిని మరోసారి అర్థం చేసుకుని అంగన్‌వాడీ కేంద్రంలో పాటించాలని సూచించారు. పిల్లలకు అర్థమయ్యేరీతిలో బోధించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో–1, 2 తులసీకుమారి, పద్మావతి, హెచ్ఎం మన్నం శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనూరాధ, డీఆర్పీలు కృష్ణప్రసాద్, కిషోర్, శారద, అంగన్‌వాడీ వర్కర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ కళాశాల వార్షికోత్సవం



సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రంగనాయకులు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 41వ వార్షికోత్సవం శనివారం ప్రిన్సిపాల్ కేపీ రంగనాయకులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు వార్షికోత్సవానికి జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి (డీఐఈఓ) ఐ.శ్రీనివాసరావు, రీజనల్ ఇన్ స్పెక్షన్ అధికారి (ఆర్ఐఓ) సైమన్ విక్టర్ పాల్గొని విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి బాగా చదివి ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి కళాశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపాల్ రంగనాయకులు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు. గ్రామస్తుల సహకారంతో కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి మొత్తం 170 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. తొలుత కళాశాల స్థలదాత అమరా కృష్ణమూర్తి చిత్రపటానికి ఆయన కుమారుడు అమరా రాఘవేంద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ శాసన సభ్యుడు పాలపర్తి డేవిడ్‌రాజు జ్ఞాపకార్థం ఆయన సతీమణి విద్యుల్లత ఎస్ టైపు 10 కుర్చీలను కళాశాలకు బహూకరించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.నారాయణరావు, హైస్కూల్ హెచ్ఎం చలపతిరావు, గ్రామస్తులు మాదాసు రాంబాబు, కొంజేటి వెంకట సురేష్‌బాబు, టి.శామ్యూల్ పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో పంట దిగుబడి అధికం



మాట్లాడుతున్న యూనిట్ ఇన్‌చార్జి శేషమ్మ

సంతనూతలపాడు: ప్రకృతి సేద్యంతో పంట దిగుబడితో పాటు భూమికి మరింత పోషకాలు లభిస్తాయని ప్రకృతి వ్యవసాయాధికారి శేషమ్మ అన్నారు. స్థానిక ఏపీ సీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో కలిసి 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ విత్తనాలు తయారు చేశారు. యూనిట్ ఇన్‌చార్జి శేషమ్మ మాట్లాడుతూ రైతులంతా వరి, శనగ, మినుము పంటల కోతల అనంతరం 30 రకాల విత్తనాలు కనీసం ఐదు జాతులుగా పచ్చిరొట్ట గింజలు, సుగంధ ద్రవ్యాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు ఇలా అన్ని రకాల జాతులతో కలిపిన ఈ కిట్టును భూమిలో చల్లడం ద్వారా 45 రోజుల తర్వాత పశువులు మేతగా వాడుకోవచ్చని, అంతేకాకుండా భూమిలో కలియదున్నితే నేలకు కావాల్సిన పోషకాలు అందుతాయని, పంట మార్పిడి జరుగుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక పంట దిగుబడితో పాటు ప్రజలకు ఆరోగ్యకర ఆహారం అందిస్తామని పేర్కొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

నాయిడి హరిబాబు గారి కుమారుడు వీరయ్య చౌదరి అను నాకు సంబంధించిన ఒంగోలు SRO, ఒరిజినల్ దస్తావేజు నెం.3202/2007 తేది: 14.02.2025న, ఒంగోలు కర్నూల్‌రోడ్ ఫ్లైఓవర్ దగ్గర నుండి ముక్తినూతలపాడు స్థలం దగ్గరకు ఆటోలో వచ్చి దిగి చూసుకొనగా కనబడలేదు. ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ సెల్ నెం.కు తెలియజేయగలరు.

98661 54445

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE

1) BAJAJ MAXIMA CNG BS VI 2023 MODEL AP39 VB 6545
2) TATA ACE GOLD DIESEL BS VI 2023 MODEL AP39 VE 4069
3) APE AUTO DX CLS BS VI 2024 MODEL AP39 VE 3566

Cell : 99594 43604
D. No : 37-1-14, 2nd Floor, Vara Prasad Complex, Beside East KB Restaurent, Trunk Road, ONGOLE.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఒంగోలు డివిజన్
90102 24456, 90103 57744
90102 02762
Office mail : sakshiongads@gmail.com